క్లుప్తంగా

5న చెన్నకేశవపురంలో కల్యాణం

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామం చెన్నకేశవపురంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయం కల్యాణోత్సవాన్ని వచ్చే నెల 5వ తేదీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, సామూహిక వ్రతాలు, గోపయ్య, తిరుపతమ్మల కల్యాణం వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వి.ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

సుందరేశ్వరునికి ప్రత్యేక పూజలు

నరసరావుపేట ఈస్ట్: రావిపాడురోడ్డు బాలయ్యనగర్‌లోని కళ్యాణ సుందరేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అలంకరణలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించి అలంకరణలు జరిపారు. సాయంత్రం శివస్వాముల ఆధ్వర్యంలో శివనామ పారాయణం చేశారు. ఆలయ అర్చకుడు కొమ్మాలపాటి మణికంఠశర్మ పూజాధికాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

బొల్లాపల్లి: తన కుమార్తె కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.మండలంలోని గరికపాడు గ్రామానికి చెందిన విద్యార్థి రెండు రోజుల నుంచి కనిపించడం లేదు. దీంతో సదరు విద్యార్థి తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బండ్లమోటు ఎస్సై జె.బలరాంరెడ్డి సోమవారం తెలిపారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు

నరసరావుపేట రూరల్: మండలంలోని కోటప్పకొండలో ఎరువుల దుకాణాన్ని ఏడీఏ పి.మస్తానమ్మ సోమవారం తనిఖీ చేశారు. వెన్నెల ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో రికార్డులు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, బిల్లులను పరిశీలించి అధిక ధరకు ఎరువులు, పురుగుమందులు విక్రయించవద్దని సూచించారు. అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గొడన్‌లో ఎరువుల నిల్వలను పరిశీలించి స్టాక్ రిజిస్టర్ ఆధారంగా నిల్వలు ఉన్నట్లు గుర్తించారు.

అంకితభావానికి రివార్డులు దక్కుతాయి


డాక్టర్ మోజెస్‌కుమార్‌ను సన్మానిస్తున్న 108 సిబ్బంది

చిలకలూరిపేట: అంకితభావంతో వృత్తిధర్మం నిర్వహించే వారికి అవార్డులు దానంతట అవే వస్తాయని 108 సిబ్బంది కొనియాడారు. చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోజెస్ కుమార్, దంత వైద్యురాలు డాక్టర్ భాగ్యలక్ష్మికి ఉత్తమ డాక్టర్లుగా రిపబ్లిక్‌డే సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ ఇరువురు వైద్యులకు 108 సిబ్బంది ఆసుపత్రి ప్రాంగణంలో అభినందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు శోభన్‌బాబు, మాధవి, పైలట్లు రాము, శివనాగాంజనేయులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షికోత్సవాలు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవతల ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకూ జరగనున్నాయి. తొలిరోజు మంగళవారం నుంచి 4వ తేదీ వరకూ ఘటం కుండ మహోత్సవం, 5న వసంతోత్సవం, 6న పొంగళ్లు, నైవేద్యాల సమర్పణ, 7న మొక్కుబడులు, 8న సిడిమానోత్సవం జరగనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు.

తాపీ మేస్త్రీ దుర్మరణం

నరసరావుపేట టౌన్: రైలు ఢీకొని తాపి మేస్త్రీ మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన తన్నీరు ప్రసాద్ (47) స్వగ్రామం నుంచి నరసరావుపేట పట్టణానికి ప్రతిరోజు వచ్చి తాపి పని మేస్త్రీగా పనిచేస్తుంటాడు. చిత్రాలయ టాకీస్ సమీపంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ రైలు పట్టాలు దాటుతుండగా అదేసమయంలో పట్టాలపై వచ్చిన రైలు ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ టి. సుబ్బారావు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుడికి భార్య పద్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ముద్దాయికి ఆరు నెలల జైలు

నరసరావుపేటటౌన్: చోరీ కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలు, రూ.వెయ్యి జరిమాన విధిస్తూ రెండవ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ జె.అంజయ్య సోమవారం తీర్పు చెప్పారు. నకరికల్లు మండలం దేచవరం గ్రామనికి చెందిన కొండా రమణమ్మ పొలంలో పనులు చేసుకుంటుండగా, గతేడాది జూన్ 6వ తేదీన బల్లికురవ మండలం కూకట్లపల్లి గ్రామానికి చెందిన షేక్ నాగూర్‌బాషా ఆమె మెడలో బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఈమేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన నకరికల్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్‌చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కోర్టులో నిందితుడిపై అభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

వినుకొండ జనసంద్రం


ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున విద్యార్థినులు


మేళతాళాలతో స్వాగతం పలుకుతున్న నాయీబ్రాహ్మణులు

- ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం
- భారీగా తరలివచ్చిన అభిమానులు
- కిక్కిరిసిన రహదారులు

వినుకొండ (నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వినుకొండ పర్యటన విజయవంతమైంది. 'జగనన్న చేదోడు' 3వ విడత పంపిణీ కార్యక్రమం సోమవారం వినుకొండలో నిర్వహించారు. ఈ సభకు మంది ప్రజలు హాజరుకావడంతో వినుకొండ జనసంద్రాన్ని తలపించింది. సభా ప్రాంగణం వద్ద జనం నిండిపోయి బయట కూడా వేలాది మంది సభ ముగిసే వరకు నిలబడి ఉన్నారు. ముఖ్యమంత్రి హెలీప్యాడ్ జూనియర్ కళాశాల వద్ద నుంచి వెల్లటూరు రోడ్డులోని సభాస్థలి వరకు దాదాపు కిలో మీటరుకు పైగా దూరం బారికేడ్ల వెంట మహిళలు, విద్యార్థులు ముఖ్యమంత్రికి పూలతో స్వాగతం పలికారు. వినుకొండ నియోజకవర్గంలోని వినుకొండ పట్టణం, రూరల్, బొల్లాపల్లి, ఈపూరు, శావల్యాపురం, నూజెండ్ల ఐదు మండలాల నుంచి బస్సుల్లో, వివిధ వాహనాల ద్వారా భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు హాజరు కావడంతో దాదాపు కిలోమీటరు మేర జనసంద్రాన్ని తలపించింది.

పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు వెంబడి ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలతో నిండిపోయింది. సభాస్థలి వద్ద ఏర్పాటు చేసిన ఎయిర్ బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో భారీస్థాయిలో సీఎం సభకు హాజరు కావడంతో కార్యకర్తలు, నాయకుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

మంగళ వాయిద్యాలతో స్వాగతం

నాయీ బ్రాహ్మణులకు, దర్జీలకు, రజకులకు లబ్ధి చేకూర్చే జగనన్న చేదోడు పథకం ప్రారంభం సందర్భంగా వినుకొండకు వచ్చిన ముఖ్యమంత్రికి రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఇంటూరి బాబ్జీనంద ఆధ్వర్యంలో నాయీ బ్రాహ్మణులు 50 మందికి పైగా మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు.

అందరికీ ధన్యవాదాలు

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసిన నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వినుకొండ నియోజకవర్గానికి అడిగిన వెంటనే బొల్లాపల్లి తాగునీటి సమస్యకు రూ.12 కోట్లు, వినుకొండలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ.15 కోట్లు, ముస్లిం మైనార్టీ కళాశాలకు రూ.10 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు.


వినుకొండకు వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి శాలువాకప్పి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి

పారదర్శక పాలనతో అన్ని వర్గాలకు సంక్షేమం


గొరిజవోలులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

నాదెండ్ల: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందిస్తూ పారదర్శక పాలన సాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గొరిజవోలు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలిరోజు ఎస్సీ కాలనీ నుంచి ప్రారంభమై బీసీ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాల వరకూ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ మూడేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అమలౌతున్న తీరును ప్రజలతో మమేకమై తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, యువతను పలకరిస్తూ ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కార్యక్రమాన్ని సాగించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాలనలో, సంక్షేమ పథకాల అమల్లో చరిత్ర సృష్టించిన నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లతో అన్ని పదవుల్లో మహిళా సాధికారత సాధించేలా అడుగులు వేయించారన్నారు. గత ఎన్నికల్లో 151 స్థానాలతో గెలుపు నందించిన ప్రజలు, రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీని అజేయంగా నిలపాలని కోరారు.

కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, సర్పంచ్ గొర్రెపాటి గృహలక్ష్మీ, ఎంపీటీసీ గేరా సుహాసిని, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, నాదెండ్ల సొసైటీ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, పార్టీ నాయకులు మద్దూరి కోటిరెడ్డి, కురుకుంట్ల వెంకటరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు చల్లా పుల్లారెడ్డి, గుర్రం ఉపేంద్ర, మంగు ఏడుకొండలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ విభాగాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీలో ద్వితీయస్థానం


జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాతాని

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళల క్రాస్ కంట్రీ పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు ద్వితీయ స్థానం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. చీరాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోటీలలో తమ కళాశాల జట్టు ద్వితీయ స్థానం సాధించటంతో పాటు జట్టులోని ఎ.లక్ష్మి సునీత వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. జట్టులోని జి.సాయిప్రియ, ఎన్.లక్ష్మీ, ఎం.శ్రావణి, కె.విశాలాక్షి, వి.వెంకటరమణలను ప్రిన్సిపల్ నాతాని, పీడీ ఈదర ఆదిబాబు, ఎం.తిరుపతిరావు, షేక్.మహ్మద్, షేక్.షకీలా అభినందించారు.

సీఎం సభకు ....


ఈపూరు నుంచి బస్సులో బయలుదేరిన మండల కార్యకర్తలు, మహిళలు


శావల్యాపురం నుంచి వినుకొండకు బయలు దేరిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

ఈపూరు: వినుకొండలో సోమవారం నిర్వహించిన జగనన్న చేదోడు పథకాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సభకు ఈపూరు మండలం నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు అనుకున్నదాని కంటే ఎక్కువ మంది హాజరయ్యారు. మండలం నుంచి 32 గ్రామాల నుంచి 75 బస్సుల్లో సోమవారం ఉదయమే ఆనందోత్సాహాలతో వినుకొండకు బయలుదేరారు. సభ విజయవంతం కావడానికి సహకరించిన మండల ప్రజలకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

శావల్యాపురం నుంచి...

శావల్యాపురం: వినుకొండలో సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి సమావేశానికి మండలంలోని అన్నీ గ్రామాల్లో మహిళలు అభిమానులు భారీగా తరలివెళ్లారు.

సాతులూరు మద్యం దుకాణంలో అగ్నిప్రమాదం

- రూ.73 లక్షల విలువైన మద్యం అగ్నికి ఆహుతి
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమన్న అధికారులు


మంటల్లో కాలిపోతున్న మద్యం దుకాణం

నాదెండ్ల: సాతులూరు గ్రామంలోని ప్రభుత్వం మద్యం దుకాణంలో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. నరసరావుపేట ఎక్సైజ్ శాఖ సీఐ బాషా కథనం ప్రకారం.. గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై పాత సినిమాహాలు వెనుక భాగాన ప్రభుత్వ మద్యం దుకాణం ఉంది. దుకాణంలో రూ.73,35,020ల విలువైన మద్యం సీసాలు నిల్వ ఉన్నాయి. సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శ్యామ్, సేల్స్‌మెన్ నాగేశ్వరరావులు మూడు రోజులుగా మద్యం అమ్మిన నగదును బ్యాంకులో జమ చేసేందుకు ఉదయం బ్యాంకుకు వెళ్ళారు. తిరిగి ఉదయం 11.05 గంటలకు షాపును తెరిచారు. కంప్యూటర్ ఆన్ చేయగా మెయిన్‌లో మంటలు చెలరేగి దుకాణం అంతటా మంటలు వ్యాపించాయి. మద్యంతో పాటూ కంప్యూటర్, ప్రింటర్, క్యాష్ కౌంటింగ్, మిషన్, ఫర్నీచర్ సహా అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం తెలుసుకున్న చిలకలూరిపేట అగ్ని మాపక దళ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. అప్పటికే దుకాణం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. దీనిపై కేసు నమోదు చేసి ఎక్సైజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ శాఖ డీఎం శ్రీనివాసులు, ఎస్సై పూర్ణచంద్రరావు, ఏఎస్సై రమేష్, వీఆర్వో అంజలి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఒకరిది మనస్తాపం.... మరొకరిది మానసిక వేదన!

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: మనస్థాపంతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం మండలంలోని వేలూరు గ్రామానికి చెందిన గొట్టిపాటి రోశయ్య (60) భార్య సుశీలతో 30 సంవత్సరాల కిందట వేరుపడి తమ్ముడుతో కలసి ఉంటున్నాడు.

గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్న రోశయ్య మనస్థాపంతో ఆదివారం ఉదయం పొలంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలంలో మృతి చెందాడు. కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసికవేదనతో మరొకరు...

చిలకలూరిపేట టౌన్: మానసిక ఆరోగ్యం బాగా లేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం. మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన ఉయ్యాల వెంకటేశ్వర్లు (45)కు కొంతకాలంగా మానసిక స్థితి సక్రమంగా లేదు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఇంట్లో భార్య లేని సమయంలో పురుగుమందు సేవించాడు. భార్య గమనించి 108 అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. అయితే అక్కడకు చేర్చినా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

విద్యుత్ పైపులైను ఏర్పాటుకు వినతి

రైల్వేకు విన్నవించిన ఏడీఏ వెంకటేశ్వర రెడ్డి


శావల్యాపురంలో రెండవ ట్రాక్ వద్ద విద్యుత్ పైపులైను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

శావల్యాపురం: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రెండవ రైల్వే ట్రాక్ పనుల్లో భాగంగాఎస్టీ కాలనీ వాసులకు విద్యుత్ సమస్య వాటిల్లే పరిస్థితి ఉందని, ఈ నేపథ్యంలో విద్యుత్ పైపులైను అత్యావశ్యకమని ఏడీఏ భవనం వెంకటేశ్వరరెడ్డి రైల్వే శాఖకు విన్నవించారు. సోమవారం రెండవ ట్రాక్ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ శావల్యాపురం గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషను నుంచి ఎస్టీ కాలనీకు వచ్చే ప్రధాన లైను మార్గంలో గతంలో రైల్వే ట్రాక్ కింద భాగాన ప్రత్యేకంగా పైపులైను ద్వారా విద్యుత్ లైను ఏర్పా టు చేసి విద్యుత్ సరఫరా ఇస్తున్నామన్నారు. ప్రస్తు తం రెండవ ట్రాక్ పనులు జరుగుతున్న నేపథ్యంలో అదే విద్యుత్ లైను మార్గానికి అనుసంధానం పైపు లైను పనులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈవిషయమై సంబంధిత రైల్వే అధికారులకు లిఖిత పూర్వకంగా తెలియచేశామన్నారు. తక్షణమే రైల్వే అధికారులు స్పందించి రెండవ రైల్వే ట్రాక్ పరిధిలో అదనంగా విద్యుత్ పైపు లైను ఏర్పాటు చేయాలని కోరారు.

మహాత్మునికి ఘన నివాళి

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డు బీసీ కాలనీలోని శ్రీమతి సరోజినీనాయుడు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం వాసవీ క్లబ్ ప్లాటినం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన పరుగుపందెం పోటీల విజేతలకు గాంధీజీ జీవితచరిత్ర పుస్తకాలు, చిత్రపటం, ఆట వస్తువులను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తాడువాయి శ్రీనివాసరావు, శ్రీ వాసవి మిత్రమండలి అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

మహాత్ముడు చూపిన మార్గం ఆచరణీయం

చిలకలూరిపేట: మహాత్ముడు చూపిన అహింసా మార్గం, ఆశయాలు ఎప్పటికీ ఆచరణీయమైనవని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో మహాత్మగాంధీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోవిందరావు సిబ్బంది పాల్గొన్నారు.

ధన్యజీవి మహాత్మాగాంధీ

నాదెండ్ల: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గణపవరం ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బొడ్డురాయి సెంటర్‌లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు.


చిలకలూరిపేటలో గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, సిబ్బంది

తిరునాళ్లకు అటవీశాఖ విస్తృత ఏర్పాట్లు

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఫిబ్రవరి 18వ తేదీన నిర్వహించే కోటప్పకొండ తిరునాళ్లకు అటవీశాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు తెలిపారు. కోటప్పకొండలో జరుగుతున్న తిరునాళ్ల ఏర్పాట్లను, అటవీశాఖ చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఘాట్‌రోడ్డులోని టోల్‌గేట్ వద్ద రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఘాట్ రోడ్డులో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన మొక్కల కొమ్మలను తొలగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో రామచంద్రరావు మాట్లాడుతూ కోటప్పకొండ నర్సరీలో 50 వేల తులసీ, మారెడు, ఉసిరి మొక్కలను పెంచుతున్నట్టు తెలిపారు. కోటప్పకొండకు వచ్చే భక్తులకు ఈ మొక్కలను తక్కువ ధరకు అందిస్తామని తెలిపారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని నర్సరీ అభివృద్ధికి వినియోగిస్తామని వివరించారు. తిరునాళ్లను పురస్కరించుకుని పాతకోటయ్య స్వామి ఆలయం నుంచి పాపనాశనం గుడి మీదుగా నరసరావుపేట రోడ్డులోని నర్సరీ చేరేవిధంగా ఐదు కిలోమీటర్ల కాలీ నడక మార్గాన్ని ఆధునీకరిస్తున్నట్టు తెలిపారు. ఘాట్‌రోడ్డులో రోడ్డుకిరువైపులా ఉన్న మొక్కలు పెరగడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిందన్నారు. తిరునాళ్ల రోజు బస్సుల రాకపోకలకు సమస్య లేకుండా కొమ్మలను కత్తిరించే పనులు చేపట్టినట్టు తెలిపారు.